సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



ప్రతీ గ్రామ చరిత్ర ఆన్‌లైన్‌లో..
ప్రతి గ్రామ చరిత్రను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ గౌరీశంకర్ అన్నారు. - 8లో



ఐఐహెచ్‌టీ లేనట్టే..
పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేయలేమని కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి పార్లమెంట్ సమావేశాల్లో స్పష్టం చేశారు. - 10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35°/19°
ఆకాశం ఉదయం పొగమంచుతో మేఘావృతంగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కంటి పరీక్షలు చేయించుకోవాలి



తిరుమలగిరిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

తిరుమలగిరి (తుంగతుర్తి) : పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్యాధికారి కోటాచలం కోరారు. తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలను పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్ రెడ్డి, 2వ వార్డు కౌన్సిలర్ హన్మంతు, వైద్యాధికారిణి మల్లెల వందన, సీహెచ్‌ఓ బిచ్చు నాయక్, మున్సిపల్ మేనేజర్ ఖదీర్, భాషా తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు



నడిగూడెంలో మాట్లాడుతున్న డీఏఓ రామారావు నాయక్

నడిగూడెం : మోతాదుకు మించి రసాయన ఎరువులను వాడవద్దని జిల్లా వ్యవసాయ అధికారి డి.రామారావు నాయక్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో వరి పొలాలను ఆయన పరిశీలించిన అనంతరం కొందరు రైతులతో మాట్లాడారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా యూరియా తగిన మోతాదులో పలు దఫాలుగా వేయాలన్నారు. ఎప్పటికప్పుడు సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలన్నారు. పంటల్లో చీడపీడల నివారణకు, ఎరువుల యాజమాన్యం పాటించడానికి వ్యవసాయ విస్తరణ అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట కోదాడ వ్యవసాయ సహాయ సంచాలకుడు టి.వాసు, మండల వ్యవసాయాధికారి ఎం.రాజగోపాలరావు, ఏఈఓలు పిచ్చయ్య, వినోద్, రేష్మా, రైతులు పాల్గొన్నారు.

చట్టబద్ధత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మహాజన సోషల్ లిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ యాతాకుల రాజయ్య, జాతీయ నాయకుడు మందకుమార్ విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ సాధనలో భాగంగా ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహించే హైదరాబాద్ – విజయవాడ హైవే దిగ్బంధం కరపత్రాలను గురువారం స్థానిక కొత్త బస్టాండ్ సెంటర్లో ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మందార రాజు, మహేందర్, నర్సయ్య, దాసరి వెంకన్న, ఉపేందర్, వెంక న్న, సుకుమార్, మల్లేష్, సోమశేఖర్, కనకయ్య, చంద్రశేఖర్, సతీష్, కిరణ్, నవీన్, వెంకట్ రాములు, రాజశేఖర్, భరత్ పాల్గొన్నారు.

ఏపీఓ వెంకయ్యపై సస్పెన్షన్ వేటు

మోతె : మండలంలో ఉపాధిహామీ అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా పనిచేస్తున్న వడకాల వెంకయ్యను డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్ గురువారం సస్పెండ్ చేశారు. ఈమేరకు ఉత్తర్వులు జారీచేశారు. వెంకయ్య గతంలో నడిగూడెం మండలంలో 2019నుంచి 2022వరకు ఏపీఓగా పనిచేసిన సమయంలో వర్క్‌సైట్ బోర్డులు ఏర్పాటు చేయకుండా, రికార్డులు లేకుండా అక్రమంగా ప్రభుత్వ నిధులను కంప్యూటర్ ఆపరేటర్‌తో కలిసి దారి మళ్లించడంతో సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్‌పై కూడా

నడిగూడెం : ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ పథకంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సుంకర రాకేష్‌ను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ ఎం.యర్రయ్య తెలిపారు. రాకేష్‌పై పలు అవినీతి ఆరోపణలు రావడంతో చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.



లింగమంతుల స్వామిని దర్శించుకునేందుకు క్యూలో నిల్చున్న భక్తులు



పెద్దగట్టు ఆలయం నుంచి సూర్యాపేట పట్టణంలోని గొల్లబజార్‌కు మకరతోరణాన్ని తరలిస్తున్న వల్లపు, కోడి వంశస్తులు, యాదవులు తదితరులు

పెద్దగట్టు జాతర పరిసమాప్తం

ఐదు రోజుల పాటు ఓ లింగా.. నామస్మరణతో మార్మోగిన దురాజ్‌పల్లిలోని శ్రీలింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర గురువారం ముగిసింది. చివరి రోజు భారీగా భక్తులు తరలివచ్చి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మకర తోరణాన్ని సూర్యాపేట పట్టణానికి తరలించడంతో జాతర పరిసమాప్తమైంది. – సూర్యాపేట, చివ్వెంల

-8లో..

పల్లె వైద్యానికి పెద్ద పీట

- పల్లె దవాఖానాలుగా ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు
- ఇప్పటి వరకు 82 పల్లె దవాఖానాలు ఏర్పాటు
- శాశ్వత భవనాలకు నిధులు మంజూరు
- గత ఏడాది 31దవాఖానాలకు.. రెండు రోజుల క్రితం 17 ఆస్పత్రులకు..
- ఒక్కొక్కదానికి రూ.20లక్షల చొప్పున కేటాయింపు



పాతర్లపహాడ్‌లోని పల్లె దవాఖానా

గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలు



పల్లె దవాఖానాల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు మెరుగయ్యాయి. వీటికి దశల వారీగా శాశ్వత భవనాలు కూడా నిర్మిస్తున్నారు. ఇప్పటికే నాలుగింటికి శాశ్వత భవనాలు పూర్తయ్యాయి.
– డాక్టర్ కోటాచలం, డీఎంహెచ్‌ఓ, సూర్యాపేట.

నాగారం : పల్లె వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఇందులో భాగంగా గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చడమే గాక వాటికి శాశ్వత భవనాలు సమకూరుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఒకే నమూనాతో అత్యాధునిక హంగులతో వీటిని నిర్మిస్తోంది. గత ఏడాది 31 పల్లె దవాఖానాలకు నిధులు మంజూరు కాగా రెండు రోజుల క్రితం 17 ఆస్పత్రులకు నిధులొచ్చాయి. జిల్లాలో మొత్తం 161 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటిలో గత ఏడాది 82 ఆరోగ్య ఉపకేంద్రాలను ప్రభుత్వం పల్లె దవాఖానాలుగా మార్చింది. ఈ దవాఖానాల్లో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు, స్టాఫ్ నర్సులను నియమించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మిగితా ఆరోగ్య ఉప కేంద్రాలన్నీ పల్లె దవాఖానాలుగా మారనున్నాయి.

పంచాయతీరాజ్ శాఖకు బాధ్యతలు

గత ఏడాది ప్రభుత్వం 31 పల్లె దవాఖానాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరయ్యాయి. నిర్మాణ పనుల బాధ్యతలను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుంచి పంచాయతీరాజ్ శాఖకు నిధులు వెళ్తాయి. వీటిలో నాలుగింటి పనులు పూర్తికాగా మిగతా 27 భవనాల పనులు కొనసాగుతున్నాయి. రెండు రోజుల క్రితం 17 పల్లె దవాఖానాల భవనాలకు కూడా నిధులు మంజూరయ్యాయి. వీటిలో హస్నాబాద్, కందిబండ, భక్తాళ్లపురం, రాంపురం, బాలంపేట, అనంతగిరి, ఖానాపురం, శాంతినగర్, చిలుకూరు, గరిడేపల్లి, గుడిబండ, మునగాల, చిల్లేపల్లి, సోమారం, నెల్లిబండతండా, అమరవరం, బి.కె.గూడెం ఉన్నాయి. వీటి నిర్మాణానికి టెండర్లను పిలిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పీహెచ్‌సీలకు దీటుగా..

అన్ని వసతులతో అత్యాధునికంగా పల్లె దవాఖానాల భవనాలను నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పల్లె దవాఖానాలను రాష్ట్ర మంతటా ఒకే నమూనాతో నిర్మిస్తున్నారు. ఒక హాల్, రెండు గదులు, మరుగుదొడ్లు, స్టోర్ రూం తదితర వసతులను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో దవాఖానాకు 250 గజాల స్థలాన్ని కేటాయించారు. ఆయా ప్రాంతాల్లో జిల్లా పంచాయతీ శాఖ, రెవెన్యూ శాఖల సమన్వయంతో స్థలాలను ఎంపిక చేసి వైద్య ఆరోగ్య శాఖకు అప్పగిస్తున్నారు. పల్లె దవాఖానాల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాల్లో సర్కారు వైద్యసేవలు మరింత మెరుగుపడనున్నాయి.

అర్వపల్లిలో వైభవంగా చక్రతీర్థం



చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

అర్వపల్లి : అర్వపల్లిలోని స్వయంభు శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి చక్రతీర్థ మహోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. నిత్యారాధనల అనంతరం పారాయణీకులచే చతుర్వేద పారాయణం, యాజ్ఞికులచే నిత్య హవనం, మూలమంత్ర, మూర్తిమంత్ర జపాలు నిర్వహించారు. దేవాలయంలో కోనేరు లేకపోవడంతో ఆలయం ఎదురుగా ఉన్న చేతిపంపు వద్ద చక్రపెరుమాళ్లకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామికి చక్రస్నానం చేయించారు. అలాగే యాగశాలలో పూర్ణాహుతి, తిరుమంజనం కార్యక్రమాన్ని జరిపారు. చివరగా ధ్వజారోహణం సందర్భంగా ధ్వజస్తంభానికి ఉంచిన ధ్వజపటాన్ని దించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, ఆలయ చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, ఉపసర్పంచ్ ప్రభాకర్, కదారి నరేష్, పులిచర్ల ప్రభు, ఈఓ వై.శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పి.శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, ఆనంద్‌దీక్షితులు, పవన్‌కుమార్, యాజ్ఞీకుడు గుడిపూడి మాధవచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని గురువారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదేవిధంగా నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తికట్టించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు వేదమంత్రోచ్ఛరణలతో కల్యాణతంతును ముగించారు. నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం పనులు చేపట్టాలి



మెగా పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సురేష్

పెన్‌పహాడ్: ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో క్రీడా ప్రాంగణాలను గుర్తించి వాటి నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని జెడ్పీ సీఈఓ సురేష్ కోరారు. గురువారం మండల పరిధిలోని గాజులమల్కాపురం గ్రామంలో మెగా పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వనాల్లో మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలో 50మంది కూలీలకు తగ్గకుండా ఉపాధి పనులను చేపట్టాలన్నారు. గ్రామంలో క్రీడా ప్రాంగణం స్థలాన్ని పరిశీలించారు. వారం రోజుల్లో క్రీడాప్రాంగణం పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవి సమీపిస్తున్నందున ప్రతి మొక్కను కాపాడేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ యాదయ్య, ఎంపీడీఓ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ పద్మ, ఏపీఓ రవి, ఈసీ ఏకస్వామి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి 'ప్రజాగోస - బీజేపీ భరోసా'



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

దురాజ్ పల్లి (సూర్యాపేట) : టీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతి పాలనను పారదోలడానికి ఈనెల 15వ తేదీ నుంచి సూర్యాపేట నియోజకవర్గంలో ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంపై టీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొడతామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు ఇచ్చిన నిధులను వివరిస్తామని తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గంలో టీఆర్‌ఎస్ నాయకుల అరాచకాలు, అక్రమాలు మంత్రికి తెలియనట్లు నటిస్తున్నారని, ఈ భరోసా యాత్ర ద్వారా మంత్రి ముసుగును తొలగించి ప్రజల్లో దోషిగా నిలబెడతామన్నారు. ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమ సూర్యాపేట నియోజకవర్గ కోఆర్డినేటర్లుగా కర్నాటక కిషన్, సలిగంటి వీరేంద్ర, పల్స మల్సూర్ గౌడ్, చల్లమల్ల నరసింహ, కొప్పుల క్రాంతి, పట్టణ కన్వీనర్‌గా కట్కూరి కార్తీక్ రెడ్డి, సభ్యులుగా వల్దాసు ఉపేందర్, ఆరురి శివ, కొండేటి ఏడుకొండలు, అక్బర్, తణుకునూరి సంతోష్, పగిళ్ల సుసింధర్ రెడ్డి, దోసకాయల ఫణి నాయుడు, దాసరి వెంకన్న యాదవ్, చెరుకుపల్లి సంజీవ, బొజ్జ పరశురాములు, జల్లి గణేష్, సలీం, సాంబశివరావులను నియమించామన్నారు. సూర్యాపేట మండల కన్వీనర్‌గా వెన్న శశిధర్ రెడ్డి, సభ్యులుగా ఉప్పు శ్రీనివాస్, మొండి కత్తి శివాజీ, రమేష్ యాదవ్, బద్రి, సురేష్‌లను నియమించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఆబిద్, సలిగంటి వీరేంద్ర, మన్మథ రెడ్డి, మమతారెడ్డి పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్

హుజూర్‌నగర్: సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేసి కుటుంబ పాలన సాగిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి ఆరోపించారు. గురువారం హుజూర్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ప్రజలను అభివృద్ధి పేరుతో స్థానిక ఎమ్మెల్యే మోసం చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఆధ్వర్యంలో లిఫ్టులు నడిపిస్తామని చెప్పి గాలికి వదిలేశారన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 10 నుంచి 15 రోజులు శక్తికేంద్ర మీటింగులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. సమావేశంలో ఇంటి రవి, అక్కిరాజు యశ్వంత్, తోట శేషు, గుండెబోయిన వీరబాబు, బాల వెంకటేశ్వర్లు, అంబళ్ల నరేష్, పత్తిపాటి విజయ్, కీత శ్రీను, లింగరాజు, అంజయ్య, విజయ్ భాస్కర్, వెంకటేశ్వర్లు, సోమరాజు, రంగా నాయక్, శివాజీ పాల్గొన్నారు.

పంచాయతీల్లోనే జనన మరణ ధ్రువ పత్రాలు

- పల్లె ముంగిట అందుబాటులోకి సేవలు
- మీ సేవలో నమోదు చేసుకుంటే పొందే అవకాశం
- సరైన అవగాహన లేక వినియోగించుకోలేక పోతున్న ప్రజలు



తిరుమలగిరి ఎంపీడీఓ కార్యాలయంలో వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

ఇబ్బందులు లేకుండా జారీ చేస్తున్నాం



ప్రతి గ్రామ పంచాయతీలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను ఇబ్బందులు లేకుండా నమోదు చేసుకొని జారీ చేస్తున్నాం. మీ సేవ ద్వారా అప్లై చేసుకొని పంచాయతీ కార్యాలయంలో అందజేయాలి.
– ఉమేష్‌చారి, ఎంపీడీఓ, తిరుమలగిరి.

తిరుమలగిరి (తుంగతుర్తి): జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో ప్రస్తుతం మున్సిపాలిటీల్లో అమలవుతున్న విధానాన్ని గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం విస్తరించింది. దరఖాస్తులను మీ సేవ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలి. ఈ వివరాలను పంచాయతీ కార్యదర్శి నిర్ధారించుకున్నాక రికార్డుల్లో నమోదు చేసి ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. దీని ఆధారంగా మీ సేవ కేంద్రాల్లో పత్రాలు పొందవచ్చు. అయితే గ్రామాల్లో ప్రజలకు అవగాహన లేక ఈ సేవలను వినియోగించుకోలేకపోతున్నారు.

పారదర్శకతకు అవకాశం..

చాలా మంది జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు అవసరం వచ్చినప్పుడే కార్యాలయాల చుట్టూ తిరుగుతారు. సంవత్సరాల కిందట మరణించిన వ్యక్తుల ఆధారాల సేకరణ కష్టమవుతుంది. న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం లేకపోలేదు. జనన, మరణ వివరాలను కార్యదర్శి రికార్డుల్లో నమోదు చేసి ఏడాది పాటు పంచాయతీల్లోనే ఉంచుకుంటారు. అనంతరం శాశ్వత ప్రాతిపదికన వాటిని తహసీల్దార్లకు అప్పగిస్తారు. వాటి ఆధారంగా ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. ప్రస్తుత కొత్త విధానం ద్వారా పారదర్శకతకు పెద్ద పీట వేసినట్లయింది. ఈ పత్రాలు లేని పక్షంలో సంక్షేమ పథకాలతో సహా ఇతర చిక్కులకు దారి తీసిన ఉదంతాలు ఉన్నాయి. పత్రాలు కావాల్సిన వారు మీ సేవలో రూ.45 చెల్లించి రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా పొందే అవకాశం ఉంది. ఆన్‌లైన్ దరఖాస్తు నంబర్ ఎప్పటికీ భద్రంగా ఉంటుంది. మరణించిన వ్యక్తి పేరున ఒకసారి ధ్రువీకరణ పత్రం జారీ అయితే ఎవరి ప్రమేయం లేకుండానే ఆసరా పింఛన్, రేషన్ బియ్యం, ఓటరు కార్డు రద్దవుతుంది. పంచాయతీల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు అందుతున్నా వీటిపై ప్రజలకు అగాహన కల్పించలేదు.

వేధిస్తున్న కంప్యూటర్ల కొరత..

ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో కంప్యూటర్ల కొరత వేధిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొన్ని పంచాయతీల్లో కంప్యూటర్ల కొరత ఉంది. దీంతో పాటు కార్యాలయాల్లో సరిగ్గా ఇంటర్నెట్ సిగ్నల్ రాక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వీటి నిర్వహణపై కార్యదర్శులకు ఎలాంటి శిక్షణ ఇవ్వలేదు. దీంతో మండల పరిషత్ కార్యాలయంలోనే ఉంచి ఆపరేట్ చేస్తున్నారు. ఈ కారణంగా కొన్నిసార్లు ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం జరిగే అవకాశం ఉంది. ప్రతి పంచాయతీకి కంప్యూటర్లు అందజేస్తే లక్ష్యం నెరవేరడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి.

దూడలకు వ్యాక్సిన్ వేయించాలి



తుంగతుర్తిలో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు

తుంగతుర్తి: ప్రతి పాడి రైతులు తమ దూడలకు తప్పని సరిగా బ్రూసెల్లా వ్యాక్సిన్ వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పశువైద్యశాలను ఆకస్మికంగా సందర్శించి, బ్రూసెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ వ్యాక్సిన్ వేయిస్తే దూడలు ఆరోగ్యంగా ఉంటాయని, వాటిలో ఎదుగుదల ఉంటుందన్నారు. వ్యాక్సిన్ వేసిన దూడలు పెరిగి పెద్దవైన తరువాత వాటి పాలు మనకు ఆరోగ్యకరమన్నారు. ప్రతి పాడిరైతు వరిగడ్డితో పాటు పచ్చిగడ్డిని కూడా పశువులకు సమానంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యశాఖ ఏడీ డాక్టర్ రవిప్రసాద్, డాక్టర్ సుష్మ, బుచ్చిబాబు, గణేష్, రైతులు సుశీల, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్ గేమ్స్ మీట్ ప్రారంభం

అనంతగిరిలోని అనురాగ్ ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ క్రీడాపోటీలను టెక్నికల్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పుల్లయ్య, సాంకేతిక విద్యా సంచాలకురాలు అరుంధతి ప్రారంభించారు.



రన్నింగ్ పోటీలో పాల్గొన్న బాలికలు



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న క్రీడాకారిణులు

-10లో

స్వల్పంగా పెరిగిన హుండీ ఆదాయం


హుండీలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

చివ్వెంల (సూర్యాపేట): లింగమంతులస్వామి జాతరలో ఏర్పాటు చేసిన హుండీలను గురువారం అధికారులు లెక్కించారు. గత జాతరలో హుండీ ఆదాయం రూ.23.28లక్షలు రాగా, ఈసారి మొత్తం 28 హుండీల్లో రూ.25.71 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారుల వెల్లడించారు. అదేవిధంగా 550 గ్రాముల వెండి, రెండు గ్రాముల బంగారం వచ్చినట్లు పేర్కొన్నారు. అయితే ఓ యువకుడు తాను ప్రేమించిన అమ్మాయితో జీవితాంతం కలిసి ఉండాలని రక్తంతో లేఖ రాసి హుండీలో వేశాడు. కార్యక్రమంలో ఆర్డీఓ రాజేంద్రకుమార్, తహసీల్దార్ రంగారావు, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేందర్‌కుమార్, ఈఓ కుశలయ్య, పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులుయాదవ్, డైరెక్టర్లు జటంగి వెంకటేశ్వర్లుయాదవ్, కాసం శ్రీనివాస్, మట్టపల్లి శ్రీనివాస్, మొండికత్తి దుర్గమ్మ, మెంతబోయిన వెంకన్న, వార్డు కౌన్సిలర్ జాటోతు లక్ష్మి మకట్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

మకర తోరణం తరలింపులో తోపులాట

జాతర ముగింపు సందర్భంగా నిర్వహించిన మకర తోరణం తరలింపులో కోడి, వల్లపు వంశీయుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. పోలీసులు గమనించి ఇరు వర్గాలకు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. అదేవిధంగా గట్టుపై పీకలు ఊదుతూ ఆకతాయిలు ఘర్షణ పడడంతో కొంతమంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

లింగమయ్యా.. మళ్లొస్తామయ్యా


బోనం సమర్పించేందుకు వస్తున్న యువతి


పెద్దగట్టు వద్ద గొర్రె పొట్టేలుతో ఆలయ చైర్మన్, నాయకులు తదితరులు

- ముగిసిన పెద్దగట్టు జాతర
- చివరి రోజు వైభవంగా మకర తోరణం తరలింపు

సూర్యాపేట, చివ్వెంల: ఐదు రోజుల పాటు ఓ లింగా.. ఓ లింగా.. నామస్మరణతో మార్మోగిన పెద్దగట్టు జాతర గురువారం ముగిసింది. చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలో కొలువైన శ్రీలింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతరకు లక్షలాది మంది భక్తులు హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణలోనే రెండో అతిపెద్దదైన ఈ జాతర ఈ నెల 5వ తేదీన సూర్యాపేట మండలం కేసారం గ్రామం నుంచి దేవరపెట్టె, సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి మకర తోరణాన్ని పెద్దగట్టుకు తీసుకురావడంతో ప్రారంభమైంది. జాతరలో అత్యంత ముఖ్య ఘట్టమైన సౌడమ్మ తల్లికి బోనాల చెల్లింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మంగళవారం చంద్రపట్నం, బుధవారం నెలవారం కార్యక్రమాలను చేపట్టారు. గురువారం మకర తోరణాన్ని సూర్యాపేటకు తరలించడంతో జాతర ముగిసింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జిల్లా అధికారులు, ఆలయ పాలకవర్గం సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేశారు.

మకర తోరణం ప్రత్యేకత..

యాదవుల సంప్రదాయం ప్రకారం జాతర ప్రారంభానికి ముందు లింగమంతుల స్వామి అలంకరణ కోసం సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి కోడి, వల్లపు వంశస్తులు మకర తోరణాన్ని తెచ్చారు. ఈ తోరణాన్ని తిరిగి ఊరేగింపుగా సూర్యాపేటకు తరలించారు. అదేవిధంగా లింగమంతుల స్వామి గుడిపై ఉంచిన పసిడి కుండను దురాజ్‌పల్లి ఆవాసం ఖాసీంపేటకు చెందిన అలిశెట్టి వంశస్తులు జాతరకు ముందు తీసుకువచ్చి తిరిగి గురువారం తీసుకువెళ్లారు.

అన్ని శాఖల సమన్వయంతో..

జాతర విజయవంతం కావడంలో అన్ని శాఖలు సమన్వయంగా పనిచేశాయి. పోలీసు శాఖ అత్యాధునిక సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణను విజయవంతంగా నిర్వహించింది. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి ప్రజా రవాణాకు సమహకరించింది. వైద్యారోగ్యశాఖ ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసి భక్తులకు సేవలందించింది. పారిశుద్ధ్య నిర్వహణలో మున్సిపల్ శాఖ, భక్తులకు తాగునీటికి ఇబ్బందులు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టారు. పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సమన్వయంతో జాతర కవరేజీ నిర్వహించింది. వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు పర్యాటక ప్రదేశాలపై ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకున్నాయి. జాతరలో విజయవంతంగా పూర్తికావడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

సూర్యాపేట పట్టణంలోని కృష్ణా టాకీస్ ప్రాంతానికి చెందిన 4 సంవత్సరాల బాలుడు తల్లిదండ్రులతో కలిసి దురాజ్‌పల్లి జాతరకు వచ్చి తప్పిపోయి తిరుగుతుండగా తుమ్మలపెనపహాడ్ గ్రామానికి చెందిన కొరివి లింగయ్య గుర్తించి పోలీస్ కంట్రోల్ రూంలో అప్పగించాడు. పోలీసులు బాలుడి తల్లిదండ్రులను గుర్తించి వారికి బాలుడిని అప్పగించారు.


స్వామి వారికి మొక్కుతున్న భక్తులు


కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

ప్రతీ గ్రామ చరిత్రను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తాం

- తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్


రైతులతో మాట్లాడుతున్న జూలూరి గౌరీశంకర్

నడిగూడెం: తెలంగాణలోని ప్రతి గ్రామ చరిత్రను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపర్చడంతో పాటు సాహిత్య అకాడమీలో గ్రంథాల రూపంలో అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. మన ఊరు-మన చరిత్ర కార్యక్రమంలో భాగంగా గురువారం నడిగూడెం మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో కోదాడకు చెందిన కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు చేపట్టిన సర్వేను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి రైతులు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బందితో మాట్లాడారు. గ్రామంలో పండిస్తున్న పంటల వివరాలు, పశుసంపద, గ్రామస్తుల స్థితిగతులు, జీవన విధానం, సాయుధ పోరాట యోధుల వివరాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 33మంది కోఆర్డినేటర్ల ఆధ్వర్యంలో విద్యార్థులతో గతేడాది నవంబరులో మన ఊరు-మన చరిత్ర కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు ఖమ్మంలో 700 గ్రామాలు, నల్లగొండ ఎన్‌జీ కళాశాల విద్యార్థులు 250 గ్రామాలు, కోదాడ కేఆర్‌ఆర్ కళాశాల విద్యార్థులు 26 గ్రామాల చరిత్రను సేకరించడం పూర్తిచేశారని తెలిపారు. రాష్ట్రంలోని 12,769 గ్రామాల ప్రజలకు తమ ఊరి చరిత్రను తెలియజేయాలనే సంకల్పంతో సంబంధిత జిల్లా కలెక్టర్లు, ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీకోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నందిగామ నిర్మలకుమారి, తెర సాంస్కృతిక వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలుగు అధ్యాపకుడు వేముల వెంకటేశ్వర్లు, రాంపల్లి సతీష్, గ్రామ పెద్దలు మొక్క భిక్షపతి, వట్టికూటి చలపతి, శెట్టి సతీష్, పసుపులేటి యాదగిరి, తాళ్లూరి రమేష్, వేదాంతం చక్రధరాచార్యులు ఉన్నారు.

రాజావారి కోటను సందర్శించిన గౌరీశంకర్

నడిగూడెం మండల కేంద్రంలోని రాజావారి కోటను గురువారం జూలూరి గౌరీశంకర్ సందర్శించారు. ఈ సందర్భంగా కోటలోని పలు భవనాలు, గ్రంథాలయంలో గ్రంథాలను పరిశీలించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కాగితరామచంద్రాపురం గ్రామానికి చెందిన అబ్దుల్ ఘని (38), పఠాన్ షరీఫ్ (40) కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట డాక్టర్ నందిగామ నిర్మల కుమారి, వేముల వెంకటేశ్వర్లు ఉన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: మండల పరిధిలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో నిరుద్యోగ యువతకు రెండు నెలల కాలపరిమితితో అకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ), బేసిక్ కంప్యూటర్ అండ్ ఇంగ్లిష్, ఆటోమొబైల్ 2, 3 వీలర్ సర్వీసింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ) కోర్సుకు బీకాం, బేసిక్ కంప్యూటర్ అండ్ ఇంగ్లిష్ కోర్సుకు ఇంటర్మీడియట్, ఆటోమొబైల్ 2, 3 వీలర్ సర్వీసింగ్ కోర్సుకు పదో తరగతి పాసై ఉండాలని తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కల్గి ఉండాలని, ఆసక్తి, అర్హత కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హత ఒరిజినల్, జిరాక్స్ సెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డుతో ఈ నెల 20న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరుకావాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.2వేల ఫీజుతో పాటు హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. అదేవిధంగా స్టడీ మెటీరియల్‌కు రూ.350లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత అభ్యర్థులకు తప్పనిసరిగా ఉద్యోగం కూడా కల్పించబడుతుందన్నారు. ఇతర వివరాలకు 9133908000, 933908111, 9133908222 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇంజక్షన్ వికటించడంతో నడవలేని స్థితికి బాలుడు

- పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రుల ఫిర్యాదు


కుమారుడితో తల్లిదండ్రులు

కోదాడరూరల్: ఇంజక్షన్ వికటించడంతో బాలుడు నడవలేని స్థితికి చేరుకున్నాడు. ఈ సంఘటన కోదాడ మండల పరిధిలోని మంగళితండాలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలుడి తల్లిదండ్రులు ధరావత్ వెంకటేశ్వర్లు, పుష్ప తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 30న తమ కుమారుడు మోక్షిత్‌కు జ్వరం రావడంతో స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీ పాషా వద్దకు తీసుకెళ్లినట్లు తెలిపారు. అతను కాకుండా ఆయన తన కుమారుడితో బాలుడికి ఇంజక్షన్ వేయించారని ఆరోపించారు. అప్పటి నుంచే తన కుమారుడు నడవలేకపోతున్నాడని వాపోయారు. ఖమ్మం తీసుకెళ్లి వైద్యం చేయించినా ఎలాంటి మార్పులేదన్నారు. గురువారం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు సూర్యాపేట ప్రభుత్వ వైద్యశాలకు లేక హైదరాబాద్‌లోని ఉస్మానియా వైద్యశాలకు తీసుకెళ్లాల్సి ఉంటుందని చెప్పారని తెలిపారు. తమ కుమారుడిని నడవలేని స్థితికి తీసుకొచ్చిన ఆర్‌ఎంపీ పాషా, అతని కుమారుడిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయంపై రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆర్‌ఎంపీ పాషాను వివరణ కోరగా ఇంజక్షన్ ఇచ్చిన మాట వాస్తవమేనని, ఇంజక్షన్ వేసే సమయంలో బాలుడు కాలు కదిపి ఉండొచ్చని, ఆ సమయంలో ఏదైనా జరిగి ఉండొచ్చని పేర్కొన్నారు.

కేసు నమోదు

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడేనికి చెందిన బాతరాజు నర్సింహ బుధవారం బైక్‌పై వెళ్తుండగా వలిగొండ చౌరస్తా వద్ద వెనుక నుంచి మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన నర్సింహను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గురువారం నర్సింహ కుమారుడు లింగస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.

హోండా షోరూంలో చోరీ

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని కోదాడ రోడ్డులో గల హోండా షోరూంలో బుధవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. షట్టర్ తాళం పగులగొట్టి షోరూంలోకి ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు హార్డ్‌డిస్క్, 2 సీసీకెమెరాలు, 2 వైఫై రూటర్లు అపహరించారు. షోరూం యజమాని సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అపహరించిన ఎడ్లను పట్టుకున్న రైతులు

- పరారైన దుండగులు

కొండమల్లేపల్లి: అపహరణకు గురైన ఎడ్లను రైతులు పట్టుకోగా.. వారిని చూసి దుండగులు పరారయ్యారు. ఈ సంఘటన మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన బొడ్డు లాలయ్య బుధవారం తన వ్యవసాయ పొలంలో జోడెడ్లను కట్టేసి ఉంచాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన అతడు భోజనం చేసిన తర్వాత రాత్రి 11 గంటల సమయంలో మిరప తోటకు నీళ్లు పెట్టేందుకు పొలం వద్దకు వెళ్లి చూడగా ఎడ్లు కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల గాలించాడు. ఈ విషయాన్ని గ్రామంలోని రైతులకు తెలియజేయడంతో పాటు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ క్రమంలోనే నాంపల్లి మండలం పగుడిపల్లి గ్రామ సమీపంలో రైతులు అపహరణకు గురైన ఎడ్లను గుర్తించారు. రైతులు రావడాన్ని పసిగట్టిన దుండగులు ఎడ్లను అక్కడే వదిలేసి పరారయ్యారు. ఎడ్లను అపహరించేందుకు యత్నించిన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు పోలీసులను కోరారు.

పాలు కాదు.. విషం!

రసాయనాలతో కృత్రిమ పాలు తయారీ

- శవాలను భద్రపరిచేందుకు వాడే ఫార్మాల్డిహైడ్ వినియోగం
- అధికారుల తనిఖీల్లో వెలుగులోకి
- రెండు నెలల్లో ఆరు ఘటనలు
- ఈజీ మనీ కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం


బీబీనగర్ మండలం కొండమడుగులో కల్తీ పాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: సంపాదనే ధ్యేయంగా కొందరు అక్రమార్కులు ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. ప్రమాదకర రసాయనాలతో కృత్రిమ పాలు తయారు చేస్తూ వినియోగదారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. గతంలో పాల పౌడర్, యూరియా, నూనె కలిపి పాలు తయారు చేయడం చూశాం. కానీ, బీబీనగర్ మండలం కొండమడుగలో ఓ వ్యాపారి మనుషుల శవాలను భద్రపరిచేందుకు వాడే ప్రాణాంతక ఫార్మాల్డిహైడ్‌ను కలుపుతున్నట్లు ఫుడ్ సెక్యూరిటీ అధికారులు గుర్తించారు. గడిచిన రెండు నెలల్లో ఐదు చోట్ల కల్తీ పాలు పట్టుబడ్డాయి. తాజాగా గురువారం భూదాన్‌పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామంలో కల్తీ పాల తయారీ గుట్టు రట్టయ్యింది.

రాజధానికి సమీప మండల్లాలో ఎక్కువ

పాల దిగబడి తగ్గి, మరోవైపు డిమాండ్ పెరగడంతో అక్రమార్కులు కల్తీ పాల తయారీకి మొగ్గ చూపుతున్నారు. లాభాల అత్యాశతో స్వచ్ఛమైన పాలను కల్తీ చేస్తున్నారు. ముఖ్యంగా కల్తీ పాల దందా హైదరాబాద్‌కు చేరువలో ఉన్న హెచ్ఎండీఏ మండలాలైన భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, భువనగిరి, చౌటుప్పల్, బొమ్మలరామారంలో జోరుగా సాగుతోంది. వ్యాపారులు తెల్లవారుజామునే నగరానికి పాలు రవాణా చేస్తుండటంతో అధికారుల నిఘా కొరవడింది. ఇది కాస్తా అక్రమార్కులకు కలిసొస్తుంది.

లీటరు పాలు మూడింతలు

వ్యాపారులు గ్రామాల్లో రైతుల నుంచి గేదే పాలను లీటరు రూ.40ల నుంచి రూ.45కు కొనుగోలు చేస్తున్నారు. వీటిలో నీళ్ల, పాల పౌడర్, ఇతర రసాయనాలను కలిపి మూడింతలు చేస్తున్నారు. ఈ పాలను ఆటోలు, ట్రాలీలు, ద్విచక్ర వాహనాలపై హైదరాబాద్‌లోని హోటళ్లు, స్వీటు షాపులు, గృహాలకు సరఫరా చేస్తూ లీటరు రూ.60 నుంచి రూ.80లకు విక్రయిస్తున్నారు. అయితే కల్తీని గుర్తించని ప్రజలు.. గ్రామాల నుంచి వచ్చే పాలు స్వచ్ఛమైనవని భావించి కొనుగోలు చేస్తున్నారు.

దుష్పరిమాణాలు

హైడ్రోజన్ పెరాక్సైడ్, ఫార్మాల్డిహైడ్, సుక్రోజ్, నూనె, యూరియా, సర్ఫ్, బేకింగ్ సోడా, యూరియా, పాలపొడి లాంటి రసాయన పదార్థాలను వినియోగించి కృత్రిమ పాలు తయారు చేస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో వెలుగుచూసింది. అయితే కల్తీ పాలను దీర్ఘకాలంగా తాగడం వల్ల ప్రాణాంతక క్యాన్సర్, కాలేయం, మెదడు సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని డాక్టర్లు పేర్కొంటున్నారు.

నమోదైన కేసులు

- ఈ నెల 9వ తేదీన భూదాన్‌పోచంపల్లి మండలం ఇంద్రియాలలో 200 లీటర్ల కల్తీ పాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- జనవరి 31న భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్, బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లిలో 400 లీటర్ల కల్తీ పాలు పట్టుబడ్డాయి.
- జనవరిలో బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామానికి చెందిన ఓ వ్యాపారి తన పాల సెంటర్‌లో పాలు విరిగిపోకుండా, ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు ఫార్మాల్డిహైడ్ రసాయనాన్ని వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు.
- జనవరిలో భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపూర్‌లో కల్తీ పాలు పట్టుబడ్డాయి.
- జనవరిలో చౌటుప్పల్ మండలం అల్లాపురంలో 160 లీటర్ల కల్తీ పాలను పోలీసులు పట్టుకున్నారు.
- మూడు నెలల క్రితం బొమ్మలరామారం మండలం చౌదరిపల్లిలో పోలీసులు కల్తీపాల గుట్టు రట్టు చేశారు.

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

కల్తీ పాలను తాగడం వల్ల ముఖ్యంగా జీర్ణక్రియ, కండరాలు, నాడీ వ్యవస్థ, మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కల్తీ పాలలో వినియోగించే రసాయనాలు స్లో పాయిజన్‌గా మారి శారీరక, మానసిక సమస్యలు ఏర్పడుతాయి. జ్ఞాపక శక్తి మందగిస్తుంది.రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లలు, వృద్ధుల్లో ఈ ప్రభావం అధికంగా ఉంటుంది.

– డా. యాదగిరి, భూదాన్‌పోచంపల్లి

తనిఖీలు ముమ్మరం

కల్తీ పాలను తయారు చేసి విక్రయించడం నేరం. గ్రామాల్లో కల్తీ పాలను తయారు చేసే వారిని గుర్తించేందుకు ముమ్మరంగా తనిఖీలు చేసి అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తున్నాం. అవసరమైతే వారిపై పీడీ యాక్ట్ పెట్టుతాం. పాలు, ఇతర ఆహారపదార్థాలు కల్తీ చేస్తున్నట్లు తెలిస్తే ప్రజలు అధికారులకు సమాచారం ఇవ్వాలి.

– జ్యోతిర్మయి, జిల్లా జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

పాలల్లో రసాయనాలు

- కల్తీ పాలు తయారీదారుడిపై కేసు


కల్తీ పాల క్యాన్లతో నిందితుడు ప్రభాకర్

భూదాన్‌పోచంపల్లి: కల్తీ పాలు తయారు చేసి విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామానికి చెందిన పాల వ్యాపారి పట్నం ప్రభాకర్ కల్తీ పాలను తయారు చేసి సొంత వాహనంలో హైదరాబాద్‌లోని హోటళ్లు, వినియోగదారులకు విక్రయిస్తున్నాడు. కల్తీ పాలు తయారు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం ఉదయం పోలీసులు ప్రభాకర్ ఇంటిపై దాడి చేసి 200 లీటర్ల కల్తీపాలతో పాటు, పాలలో వినియోగించే ఒక లీటర్ హైడ్రోజన్ పెరాక్సైడ్ బాటిల్, ఒక పాల ప్యాకెట్, ఐదు అల్యూమినియం పాల క్యాన్‌లను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు ప్రభాకర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదిరెడ్డి తెలిపారు.

పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ

- బంగారు ఆభరణాలు, రూ.25వేల నగదు అపహరణ

నేరేడుచర్ల: తాళం వేసిన ఇంట్లో పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన గురువారం సాయంత్రం నేరేడుచర్ల పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వెంకట్రామా థియేటర్ సమీపంలో నివసిస్తున్న రేపాల జనార్దన్, ఆయన సతీమణి ఊర్మిల స్వీట్లు తయారు చేసి దుకాణాలకు విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో దురాజ్‌పల్లి లింగమంతుల జాతరలో దుకాణాలు ఏర్పాటు చేసిన వారికి వారు స్వీట్లు అందజేయగా, అందుకు సంబంధించిన డబ్బులు వసూలు చేసేందుకు గురువారం ఉదయం 10గంటల సమయంలో భార్యాభర్తలు ఇంటికి తాళం వేసి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపు పగులగొట్టి, ఇంట్లోని బీరువా కిందపడి ఉండటంతో పాటు భార్యాభర్తలు ఇద్దరూ ఆందోళనకు గురయ్యారు. బీరువాలో దాచుకున్న రూ.25వేల నగదు, రెండు చంప సగరాలు, రెండు చెవుల దిద్దులు, నాలుగు తులాల బంగారు ఆభరణాలు, బంగారు ఉంగరం చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే నేరేడుచర్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ మెడలో బంగారపు గొలుసు చోరీ యత్నం..

నేరేడుచర్ల పట్టణంలోని కృష్ణవేణి ఇంగ్లిష్ మీడియం పాఠశాల సమీపంలో ఇంట్లో మహిళ ఒంటరిగా ఉండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసును చోరీ చేసేందుకు యత్నించాడు. ఆ మహిళ ప్రతిఘటించడంతో ఫోన్ తీసుకొని పారిపోయాడు. బాధితురాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించింది.

బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి


నర్సయ్య (ఫైల్)

అర్వపల్లి: మండల పరిధిలోని పర్సాయపల్లి స్టేజీ వద్ద సూర్యాపేట-జనగామ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మండల పరిధలోని దేవరనేని కొత్తపల్లి గ్రామపంచాయతీకి చెందిన గైగుళ్ల నర్సయ్య(57) బుధవారం సాయంత్రం ట్రాక్టర్‌లో ధాన్యాన్ని వేసి అర్వపల్లిలోని రైస్ మిల్లుకు పంపించాడు. అనంతరం తన బైక్‌పై ట్రాక్టర్ వెనుకనే మిల్లు వద్దకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రాత్రి పర్సాయపల్లి స్టేజీ వద్దకు చేరుకోగానే బైక్ అదుపుతప్పడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి అతడిని వెంటనే సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ఎల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి. అంజిరెడ్డి తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా

భువనగిరి: కాల్వ తవ్వేందుకు వెళ్లిన కూలీ మృతికి కాంట్రాక్టర్, సైట్ ఇంజనీర్ కారణమని వారికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ గురువారం భువనగిరి ప్రధాన జూనియర్ సివిల్ కోర్టు తీర్పు వెలువరించింది. వివరాలు.. మండలంలోని బస్వాపురం గ్రామంలో 2018లో కాల్వ తవ్వుతుండగా అక్కడే కూలీ పనిచేస్తున్న మహేష్ కాల్వలో పడి మృతిచెందాడు. కాంట్రాక్టర్, సైట్ ఇంజనీర్ సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే మహేష్ మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ భిక్షపతి కేసు నమోదు చేశారు. గురువారం భువనగిరి ప్రధాన జూనియర్ సివిల్ కోర్టు ఈ కేసును విచారించి.. మహేష్ మృతికి ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాకు చెందిన సైట్ ఇంజనీర్ ఏడుకొండల్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లాకు చెందిన కాంట్రాక్టర్ శ్రీరామ్ కారణమని గుర్తించి వారికి ఏడాది జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

- సాగర్‌లో విషాదం


వాచస్పతి (ఫైల్)


నాగార్జునసాగర్ ప్రాజెక్టు దిగువన శివాలయం పుష్కర ఘాట్ వద్ద డీఎస్పీ వెంకటగిరి తదితరులు




నాగార్జునసాగర్ వద్ద కృష్ణానదిలో మునిగి మృతిచెందిన వాచస్పతి, నాగరాజు, చంద్రకాంత్